క్లుప్తంగా

ప్రభుత్వ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం



ప్రిన్సిపాల్ సబేరాఖాన్

మాడ్గుల: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ ప్రవేశాలకు అడ్మిషన్లు ప్రారంభమైనట్లు ప్రిన్సిపాల్ సబేరాఖాన్ ఓ ప్రకటనలో మంగళవారం పేర్కొన్నారు. ఇటీవల పదో తరగతిలో ఉతీర్ణులైన విద్యార్థులకు కళాశాలలో జనరల్ కోర్సులైన ఎంపీసీ, బైపీసీ, హెచ్‌ఈసీ, కోర్సులకు దరఖాస్తులు ప్రారంభమయ్యాయని చెప్పారు. విద్యార్థులు దూర ప్రాంతాలకు వెళ్లకుండా అన్ని వసతులు కలిగిన ప్రభుత్వ కళాశాలలో చేరి నాణ్యమైన విద్యను అభ్యసించాలన్నారు.

యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం



యోగాపై అవగాహన ర్యాలీ తీస్తున్న నిర్వాహకులు

మంచాల: యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని మండలంలోని జాపాల ఆయుర్వేద ఆస్పత్రి వైద్యురాలు మంజుల సూచించారు. మంగళవారం కామన్ యోగా కార్యక్రమంలో భాగంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పిల్లల నుంచి వృద్ధుల వరకు స్త్రీ, పురుష భేదం లేకుండా యోగా సాధన చేయాలన్నారు. దీంతో శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగు పడుతుందన్నారు. ఒత్తిడిని దూరం చేస్తుందన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాంరెడ్డి, శిక్షకులు భాస్కర్, విజయ, స్థానికులు పాల్గొన్నారు.

ఆర్సీబీ విజయం కోసం పూజలు



అబ్దుల్లాపూర్‌మెట్: ఐపీఎల్ ట్రోఫీలో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) జట్టు విజయం సాధించాలని కోరుతూ పెద్దఅంబర్‌పేట పురపాలక సంఘం గౌరెల్లికి చెందిన ఓ క్రికెట్ అభిమాని మంగళవారం గ్రామంలోని స్వయంభూ లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో పూజలు చేశారు.


కీర్తిరత్న పురస్కార గ్రహీతకు సత్కారం



ఈశ్వరమ్మను సత్కరిస్తున్న ఏబీసీ సభ్యులు

ఆమనగల్లు: పట్టణానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయురాలు, ప్రముఖ కవి దాస ఈశ్వరమ్మకు ఇటీవల పెద్దపల్లి జిల్లా మంథనికి చెందిన శ్రీ గౌతమేశ్వర సాహితి కళాసేవ సంస్థ కీర్తిరత్న పురస్కారం అందించింది. మంగళవారం దాస ఈశ్వరమ్మ, లక్ష్మీనారాయణ దంపతులను ఆమనగల్లు బ్యాడ్మింటన్ క్లబ్(ఏబీసీ) ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రామ్మోహన్, ఆంజనేయులు, శ్రీధర్, పాండు, రాములయ్య, కృష్ణయ్య, మణిపాల్ రెడ్డి, వెంకటస్వామి, ఆనంద్‌కుమార్, జగన్ తదితరులు పాల్గొన్నారు.

నాలాలో వ్యర్థాల తొలగింపు



ఫిరంగి నాలాలో వ్యర్థాలను తొలగిస్తున్న సిబ్బంది

ఇబ్రహీంపట్నం రూరల్: పరిసరాల పరిశుభ్రతే లక్ష్యంగా ప్రతిఒక్కరూ పని చేయాలని ఆదిబట్ల మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణ పేర్కొన్నారు. వంద రోజుల ప్రణాళికలో భాగంగా మంగళవారం ఫిరంగి నాలాలో మొలిచిన పిచ్చి మొక్కలను జేసీబీతో శుభ్రం చేయించారు. తడి, పొడి చెత్తపై అవగాహన కల్పించారు. ప్రజలంతా పరిశుభ్రతపై ఆలోచించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ డీఈ స్వర్ణకుమార్, ఎన్విరాల్‌మెంట్ ఇంజనీర్ సురేష్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

చిత్తశుద్ధి లేక.. స్థలాలు పంచక

చింతపట్లలో ఇంటి జాగాల పంపిణీకి వీడని గ్రహణం

- 25 ఏళ్లుగా వేచి చూస్తున్న దళితులు
- పట్టించుకోని నాయకులు, అధికారులు



చింతపట్లలో ఇంటి స్థలాల పంపిణీకి కొనుగోలు చేసిన భూమి

యాచారం: ఇంటి స్థలాల పంపిణీకి మండలంలోని చింతపట్ల గ్రామంలో ఏళ్లుగా గ్రహణం వీడడం లేదు. రాజకీయ నాయకుల్లో సఖ్యత లేకపోవడం, అధికారులు పట్టించుకోకపోవడంతో దళితులకు పెద్ద శాపంగా మారింది. 25 ఏళ్ల కింద గ్రామంలోని నిరుపేదలైన ఎస్సీలకు ఇళ్ల స్థలాల పంపిణీ చేయడానికి అప్పటి సర్కార్ గ్రామంలోని ఓ పట్టాదారు కుటుంబం నుంచి 2 ఎకరాల 10 గుంటల వ్యవసాయ భూమిని కొనుగోలు చేసింది. దళితుల ఇళ్ల పక్కనే ఈ వ్యవసాయ భూమి ఉండడంతో పేదలకు పంచడానికి అనువుగా ఉంటుందని అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్ణయం. అప్పట్లోనే 60 గజాల చొప్పున ఇళ్ల స్థలాలు పంచడానికి లేఅవుట్‌తో ప్లాట్లు సైతం చేశారు. దీంతో ఎస్సీలలో ఘర్షణల నేపథ్యంలో అధికారులు తయారు చేసిన సర్టిఫికెట్లను రద్దు చేసి మధ్యలోనే నిలిపేశారు. అనాటి నుంచి నేటివరకు ఆ స్థలం నిరుపయోగంగానే ఉంది. ప్రస్తుతం అందులోనే పశువుల ఆస్పత్రి, ఎల్లమ్మ గుడి నిర్మాణం చేశారు. ఎస్సీ కమ్యూనిటీ హాల్‌ను నిర్మించడానికి చూస్తున్నారు.

వందకు పైగా నిరుపేదలు

గ్రామంలో 200కు పైగా దళిత కుటుంబాలున్నాయి. అందులో వంద మందికి పైగా పెళ్లీలైన వారు, తాతాల కాలం నాటి నిర్మించిన ఇళ్లల్లోనే సంసారాలు వెల్లదీస్తున్నారు. నిరుపేదలు కొన్నేళ్లుగా ఇళ్ల స్థలాలు పంచాలని అధికారులను, ప్రజాప్రతినిధులకు విజ్ఞప్తి చేసినా ఫలితం లేకపోయింది. ప్రతి ఎన్నికల్లో స్థలాలు పంచుతామని హామీలు ఇవ్వడం , ఆ తర్వాత మర్చిపోవడం ప్రజాప్రతినిధులకు శరా మామూలైంది. దళిత కుటుంబాల్లో ఐక్యత లేకపోవడంతో స్థలాల పంపిణీకి ఓ పెద్ద శాపంగా మారింది. దీంతో ఈ భూమి రోజురోజుకు కబ్జాకు గురవుతుంది. స్థలం లేకపోవడంతోనే దొడ్డి అశోక్‌కు ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాలేదు. దీంతో మనస్తాపంతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ నేపథ్యంలో దళితుల ఇంటి స్థలాల పంపిణీకి కొనుగోలు చేసిన భూమిపై చర్చ మొదలైంది.

మళ్లీ చర్చనీయాంశం

స్థలం లేకపోవడంతోనే దొడ్డి అశోక్‌కు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాలేదని అధికారులు అంటున్నారు. అశోక్ మాత్రం తనకు ఇల్లు మంజూరు కాకుండా స్థానిక కాంగ్రెస్ నాయకులే అడ్డుకున్నారని చేతిపై రాసి ఆత్మహత్యకు పాల్పడిన విషయం చర్చనీయాంశం అయింది. ఈ నేపథ్యంలో చింతపట్ల గ్రామానికి చెందిన అధికార పార్టీకి చెందిన నేతలు ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని కలువనున్నారు. అప్పట్లో కొనుగోలు చేసిన భూమిలో మళ్లీ లేఅవుట్ చేసి దళిత కుటుంబాల్లోని అర్హులైన పేదలకు ఇంటి స్థలాలు పంపిణీ చేసి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరనున్నారు. లేకపోతే స్థలాలు లేని మరింతా మంది పేదలు ఆత్మహత్యలు చేసుకునే అవకాశం ఉందని నేతల్లో భయాందోళన మొదలైంది.

స్థలాన్ని పరిశీలిస్తాం



గ్రామంలోని సర్వేనంబరు 200 నుంచి 215 వరకు అప్పట్లో 2 ఎకరాల 10 గుంటల భూమిని ఇళ్ల స్థలాల పంపిణీకి కొన్నట్లు తెలిసింది. రికార్డులు పరిశీలిస్తాం. అప్పట్లో లేఅవుట్ చేసినట్లయితే పంచాయతీ అధికారుల ద్వారా రికార్డులు తెప్పించుకుంటా. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పేదలకు న్యాయం చేసేలా కృషి చేస్తా.

– అయ్యప్ప, తహసీల్దార్, యాచారం

ప్రజాపాలనలో మహిళలకే పెద్దపీట



కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రంగారెడ్డి

ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్: రాష్ట్రంలో కొనసాగుతున్న ప్రజాపాలనలో మహిళలకే పెద్దపీట వేయాలన్నదే సీఎం రేవంత్‌రెడ్డి సర్కారు లక్ష్యమని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదిక వద్ద మంగళవారం 236 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన గ్యారంటీ పథకాల ద్వారా మహిళలు ఆర్థికంగా బలపడుతారని, రాబోయే రోజుల్లో ప్రతి పథకం అమలు చేస్తామన్నారు. గత ప్రభుత్వంలో దళారీ వ్యవస్థ ఉండేదని విమర్శించారు. అర్హులందరికీ రేషన్ కార్డులు, పింఛన్లు, రైతు రుణమాఫీ వంటి పథకాలను ప్రభుత్వం అమలు చేయనున్నదని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డి, గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి, నాయకులు ప్రభాకర్‌గౌడ్, దాసుగౌడ్, మహేందర్‌గౌడ్, కృష్ణారెడ్డి, చంద్రంగౌడ్, శివశంకర్‌గౌడ్, పండుగుల రాజు, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులు

అంతకుముందు రెవెన్యూ సదస్సును తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే రంగారెడ్డి ప్రారంభించారు. రెవెన్యూ సమస్యల పరిష్కారంలో అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరిస్తూ ప్రతి రైతుకు మేలు చేయాలన్నారు. ధరణితో తలెత్తిన సమస్యలను భూభారతితో పరిష్కరించేందుకు అధికారులు పని చేసి ప్రజల మన్ననలు పొందాలన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

ఇబ్రహీంపట్నం: నియోజకవర్గంలో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పలు కార్యక్రమాల్లో బుధవారం పాల్గొననున్నారు. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ పరిధిలోని ఖానాపూర్‌లో ఉదయం 10.30 గంటలకు రెవెన్యూ సదస్సును ప్రారంభిస్తారు. అనంతరం స్థానిక ప్రజాభవన్(క్యాంపు ఆఫీస్)లో ఉదయం 11.30 గంటలకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేస్తారు. అనంతరం యాచారం మండల కేంద్రంలో రైతువేదిక, ఉద్యాన పంటల మార్కెట్‌కు స్థల పరిశీలన చేయనున్నారు.

హరీశ్‌రావుకు నేతల శుభాకాంక్షలు



హరీశ్‌రావును సన్మానిస్తున్న గోలి శ్రీనివాస్‌రెడ్డి

ఆమనగల్లు/కడ్తాల్: మాజీ మంత్రి హరీశ్‌రావు జన్మదినాన్ని పురస్కరించుకుని పలువురు నాయకులు మంగళవారం హైదరాబాద్‌లో ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. వీరిలో ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి, సింగిల్ విండో చైర్మన్ వెంకటేశ్‌గుప్తా, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు. మాజీ జెడ్పీటీసీ జర్పుల దశరథ్‌నాయక్, మాజీ ఎంపీపీ ఆనంద్, నాయకులు పరమేశ్ తదితరులు మైసిగండి ఆలయంలో ప్రత్యేక పూజలు చేయించారు. కడ్తాల్‌లో నిర్వహించిన సంబరాల్లో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పరమేశ్, గంప శ్రీను, రమేశ్, సాయిలు, వినోద్, పాండు,గోపాల్, లాయక్‌అలీ, కృష్ణ, సురేశ్, అంజి, సాయికుమార్, లక్ష్మణ్‌చారి, మూడరవి, శ్రీకాంత్, బాలకృష్ణ, తదితరులు ఉన్నారు.

మా పిల్లలు సర్కార్ బడికే



బడిబాట కార్యక్రమంలో ఆశ వర్కర్లు

మంచాల: సర్కార్ బడిలోనే తమ పిల్లలను చదివిస్తామని ఆరుట్ల ఆశ వర్కర్లు తెలిపారు. మంగళవారం గ్రామంలో నిర్వహించిన బడి బాట కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ఆరుట్ల ప్రభుత్వ పాఠశాలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా అభివృద్ధి చేస్తున్నారన్నారు. ఇప్పటికే రాష్ట్ర విద్యాశాఖ కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి ఆధ్వర్యంలో పనులు వేగవంతంగా జరుగుతున్నాయని తెలిపారు. ప్రతిఒక్కరూ తమ పిల్లలను సర్కార్ బడిలో చేర్పించాలని సూచించారు. కార్యక్రమంలో విద్యాకమిటీ సభ్యుడు భాస్కర్, ఆశవర్కర్లు అమృత, జ్యోతి, అలివేలు, పుష్పలత, విజయలక్ష్మి, నాగలక్ష్మి, మణి, సంధ్య, సుజాత, పద్మ, సరిత, అనిత, సునీత తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



కడ్తాల్: రైతులకు విత్తనాల సంచులు అందజేస్తున్న నాయకులు, అధికారులు



మాడ్గుల: రైతులకు మూల విత్తనాలు అందజేస్తున్న అధికారులు

కడ్తాల్: రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఆమనగల్లు వ్యవసాయ మార్కెట్ చైర్ పర్సన్ యాట గీత, వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ×నాణ్యమైన విత్తనం రైతన్నకు నేస్తం₹ కార్యక్రమంలో భాగంగా 32 మంది రైతులకు వరి ధాన్యం మినీ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నాణ్యమైన విత్తనాల సాగుతోనే మంచి దిగుబడి సాధించవచ్చన్నారు. రైతులు వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటించాలని చెప్పారు. పంటల సాగుకు అవసరమైన ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు నర్సింహ, బీచ్యానాయక్, బాలరాజు, నరేశ్‌నాయక్, వెంకటేశ్, హన్మానాయక్, రాజేందర్‌గౌడ్, ఇమ్రాన్, అశోక్, జంగారెడ్డి, ఏఓ శ్రీలత, సిబ్బంది ఉన్నారు.

విత్తనాల పంపిణీ

మాడ్గుల: రైతులకు నాణ్యమైన విత్తనాల పంపిణీ కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని ప్రొఫెసర్ జయశంకర్ యూనివర్సిటీ శాస్త్రవేత్త సమీర్ చెప్పారు. మంగళవారం మండల కేంద్రంలో రైతు వేదికలో క్వాలిటీ సీడ్ ఇన్ ఎగ్రీ విలేజ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఎంపిక చేసుకున్న రైతులకు మూల విత్తనాలను అందజేశారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త మాట్లాడుతూ.. కొన్నేళ్లుగా విత్తన కంపెనీలు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చి వివిధ పేర్లతో విత్తనాలను అధిక ధరలకు విక్రయిస్తున్నారన్నారు. అక్కడక్కడా నాణ్యత లోపించిన విత్తనాల ఫలితంగా దిగుబడులు తగ్గిపోతున్నాయని చెప్పుకొచ్చారు. కార్యక్రమంలో ఏఓ అరుణకుమారి, విస్తరణ అధికారులు ప్రసన్న, జోత్స్న, రాజేశ్, ప్రియాంక, నవ్య, భార్గవి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో జీలుగ విత్తనాలు

ఆమనగల్లు: పట్టణంలోని రైతు సేవా కేంద్రంలో రైతులకు 50 శాతం సబ్సిడీపై అందించడానికి జీలుగ విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని ఏఓ శ్రీనివాస్‌గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. 30 కిలోల జీలుగ బస్తా ధర రూ.4275 ఉండగా రైతులకు 50 శాతం సబ్సిడీపై రూ.2137కు అందిస్తున్నట్లు ఆయన చెప్పారు. జీలుగ విత్తనాలు కావాల్సిన రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డుతో రైతు సేవా కేంద్రానికి వచ్చి తీసుకోవాలని పేర్కొన్నారు.

ప్రారంభమైన రెవెన్యూ సదస్సులు



ఇబ్రహీంపట్నం: ముకునూర్‌లో ఆర్డీఓకు అర్జీ ఇస్తున్న దరఖాస్తుదారుడు



ఆమనగల్లు: రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్

తొలిరోజు ప్రశాంతంగా అర్జీల స్వీకరణ

ఇబ్రహీంపట్నం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూభారతి రెవెన్యూ సదస్సులు మంగళవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఇబ్రహీంపట్నం పరిధిలో తొలిరోజు ముకునూర్, తుర్కగూడ గ్రామాల్లో ప్రశాంతంగా సదస్సులు ముగిశాయి. తహసీల్దార్ సునీతారెడ్డి ఆధ్వర్యంలో ముకునూర్‌లో నిర్వహించిన సదస్సులో 17 సమస్యలపై దరఖాస్తులు అందాయి. డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో తుర్కగూడలో నిర్వహించిన సదస్సులో 4 దరఖాస్తులు వచ్చాయి. ఈ కార్యక్రమాలను ఆర్డీఓ అనంతరెడ్డి పరిశీలించారు. భూ సమస్యలు ఉన్నవారు అర్జీ చేసుకోవాలని సూచించారు.

చట్టబద్ధంగా వ్యవహరించాలి

మంచాల: రెవెన్యూ సమస్యలపై చట్టబద్ధంగా వ్యవహరించాలని ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంతరెడ్డి సూచించారు. మండలంలోని తిప్పాయిగూడ, చీదేడ్ గ్రామాల్లో నిర్వహించిన భూ భారతి రెవెన్యూ సదస్సులు ఆయన సందర్శించారు. ఎన్ని దరఖాస్తులు వచ్చాయని ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెవెన్యూ సదస్సుల్లో వచ్చే ప్రతి అర్జీకి తగు న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తిప్పాయిగూడలో 26, చీదేడ్‌లో 16 అర్జీలు వచ్చాయి. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటప్రసాద్, ఆర్‌ఐలు రమేష్, శ్రీనివాస్, జూనియర్ అసిస్టెంట్ అనిల్‌కుమార్, రెవెన్యూ అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

భూభారతితో మేలు

ఆమనగల్లు: మండలంలోని రాంనుంతలలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఇందులో 9 మంది రైతుల నుంచి దరఖాస్తులు అందాయని తహసీల్దార్ లలిత చెప్పారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన భూభారతి చట్టం 2025 ద్వారా రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు ఆనంద్‌నాయక్, శ్రీనునాయక్, మాజీ ఎంపీటీసీ సరిత పంతునాయక్, ఆర్‌ఐ సంపత్‌కుమార్, ఏఆర్‌ఐ అబ్దుల్ అయూబ్, సిబ్బంది పాల్గొన్నారు.

మొదటి రోజు అంతంత మాత్రమే

యాచారం: మండలంలో రెవెన్యూ సదస్సులకు అంతంత మాత్రమే స్పందన వచ్చింది. మొదటి రోజు మంతన్‌గౌడ్, చౌదర్‌పల్లి రెవెన్యూ గ్రామాల్లో సదస్సులు జరిగాయి. తహసీల్దార్ అయ్యప్ప మంతన్‌గౌడ్‌లో, ఉప తహసీల్దార్ కీర్తి సాగర్ చౌదర్‌పల్లిలో అర్జీలు స్వీకరించారు. మంతన్‌గౌడ్‌లో 27, చౌదర్‌పల్లిలో 14 దరఖాస్తులు వచ్చాయి.

సమస్యలకు శాశ్వత పరిష్కారం

కడ్తాల్: రైతుల భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించేందుకే ప్రభుత్వం భూ భారతి చట్టం తీసుకువచ్చిందని ఆమనగల్లు ఏఎంసీ చైర్ పర్సన్ యాటగీత అన్నారు. మక్తమాధారం, న్యామతాపూర్ గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. కందుకూర్ ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు. రైతులు భూ భారతి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మార్కెట్ వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, తహసీల్దార్ షేక్ ముంతాజ్, డీటీ ఆదిత్యరాజు, నాయకులు తదితరులు ఉన్నారు.

మాడ్గులలో..

మాడ్గుల: చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను పరిష్కరించేందుకే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ వినయ్ సాగర్ చెప్పారు. సుద్దపల్లిలో రెవెన్యూ సదస్సులను నిర్వహించారు. రైతుల నుంచి దరఖాస్తులను తహసీల్దార్ స్వీకరించారు. కార్యక్రమంలో అధికారులు నాయకులు, రైతులు పాల్గొన్నారు.



యాచారం: మంతన్‌గౌడ్‌లో ఫిర్యాదులు స్వీకరిస్తున్న తహసీల్దార్



కడ్తాల్: రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలివ్వాలి

ఇబ్రహీంపట్నం రూరల్: అర్హులైన జర్నలిస్టుందరికీ ఇంటి స్థలాలతో పాటు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) జిల్లా కార్యదర్శి ఎం.సైదులు డిమాండ్ చేశారు. ఆదిబట్లలో మంగళవారం నిర్వహించిన సంఘం సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం యూనియన్ డివిజన్ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సిలివేరు యాదగిరి, కార్యదర్శిగా పల్నాటి జగన్, ఉపాధ్యక్షులుగా పంది శ్రీను, జుబ్బూరి కుమార్, గుండెమోని శివకుమార్, సహాయ కార్యదర్శులుగా ఎర్రలింగం, నలపరాజు సైదులు, కోశాధికారిగా అలంపల్లి రవీందర్, ప్రచార కమిటీ సభ్యుడిగా కందుకూరి నగేష్‌ను ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో ఫెడరేషన్ సీనియర్ నాయకులు చిలువేరు సురేష్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

అనాథలకు అన్నదానం



కడ్తాల్: మండల పరిధిలోని చల్లంపల్లికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చల్లా సురేందర్‌రెడ్డి సతీమణి సునందరెడ్డి పుట్టిన రోజును సందర్భంగా మంగళవారం నాదర్‌గుల్‌లోని మాతృదేవోభవ అనాథాశ్రమంలో అన్నదానం చేశారు. ఆశ్రమంలోని 150 మందికి భోజనం వడ్డించారు.